


ప్రజలు ఆందోళన చెందవద్దు..



ప్రజలు ఆందోళన చెందవద్దు. వైరస్ వ్యాప్తి చెందకుండా అధికార బృందం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. గ్రామం, పౌల్ట్రీ సంబంధిత ప్రదేశాల్లో అధికారులు శానిటేషన్ ప్రక్రియ చేపట్టారు. కొద్ది రోజుల పాటు గ్రామస్థులు చికెన్, గుడ్లు తినవద్దు.పరిస్థితిని బట్టి ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. - **కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి**

అందుబాటులోకి.. ఇసుక

- కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అందుబాటులో ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడుతూ పిఠాపురం మండలం చిత్రాడ ఇసుక స్టాక్‌యార్డులో 1200 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందన్నారు.చిత్రాడలో టన్ను ఇసుక రూ.659కు లభిస్తుందన్నారు. చిత్రాడ ఇసుక స్టాక్ యార్డుకు వంగలపూడి ఇసుక రీచ్‌నుంచి ఇసుక తీసుకొస్తున్నారని చెప్పారు. 105 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇసుక రీచ్ నుంచి ఇసుక తీసుకురావడంవల్ల టన్ను రూ.659కు విక్రయిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం ఈ ధర నిర్ణయించామన్నారు. కరప మండలం ఉప్పలంకలో 3180 మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకానికి సిద్ధంగా ఉందన్నారు. మొత్తంగా జిల్లాలో 4680 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఉప్పలంకలో టన్ను ఇసుక ధర రూ.448గా నిర్ణయించామన్నారు. ఇక్కడికి ఇసుక కపిలేశ్వరపురంనుంచి వస్తుందన్నారు. ఉప్పలంకకు కపిలేశ్వరపురం రీచ్ 63 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో టన్ను రూ.448గా నిర్ణయించామన్నారు. ఇసుక కావాల్సిన లబ్ధిదారులు నేరుగా స్టాక్ యార్డుల్లో సొమ్ములు చెల్లించి ఇసుక తీసుకెళ్ల వచ్చునన్నారు. జిల్లాలో అన్ని తరహా నిర్మాణాలకు ఇసుకరవాణా జరుగుతుందన్నారు.

మరో వారంలో పెద్దాపురం స్టాకు యార్డుకు..

పెద్దాపురం ఇసుక స్టాక్ యార్డుకు ఇసుక రావడానికి మరోవారం రోజులు సమయం పడుతుందని జేసీ రాహుల్‌మీనా తెలిపారు. కాటవరం ఇసుక రీచ్ నుంచి పెద్దాపురం స్టాక్ యార్డుకు ఇసుక రావాలన్నారు. కాటవరం ఇసుకరీచ్ నుంచి రోడ్డుపైకి ఇసుక తరలించే వీలుగా ఒక నిర్మాణం సాగుతుందన్నారు. ఇది పూర్తయిన తర్వాత కాటవరం రీచ్ నుంచి పెద్దాపురం స్టాక్ యార్డుకు కూడా ఇసుక వస్తుందన్నారు. ఇక్కడ ఇసుక టన్ను రూ.415కే లభిస్తుందన్నారు.

బర్డ్ ఫ్లూకి.. చికెన్!

కోళ్లకు వైరస్.. ఆందోళనలో జనం



అయ్యో పాపం: తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో బర్డ్ ఫ్లూతో చనిపోయిన కోళ్లను గోతిలో పాతిపెడుతున్న యజమానులు



- కానూరులో నిర్ధారణ
- 62 వేల కోళ్లు మృతి
- 10 రోజులుగా మృత్యువాత
- యజమానుల సమాచారం
- స్పందించిన కాకినాడ సిబ్బంది
- బోపాల్ లేబోరేటరీకి శాంపిల్స్
- ఆదివారం ధ్రువీకరణ
- చికెన్ మార్కెట్ ఢమాల్
- అప్రమత్తమైన అధికారులు

రాజమహేంద్రవరం/ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చూస్తుండగానే కోళ్లు మృత్యువాతపడుతున్నాయి..ఉన్నట్టుండి త లలు వాల్చేస్తున్నాయి..కొన్ని కోళ్లు అయితే కొట్టు కుని చచ్చిపోతున్నాయి. నిన్నటి వరకూ కోళ్లతో కళకళలాడిన కోళ్ల ఫారాలు ప్రస్తుతం శ్మశానాన్ని తలపిస్తున్నాయి.ఎందుకంటే చనిపోయే కోళ్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా ప్రజల్లో ఆందోళన పెరిగింది. నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణా పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్ సోకింది.ఇది ఏవీఎస్ ఇన్‌ఫ్లూయేంజాలో ఒకరకం. ఆ గ్రామంలో ఉన్న మూడు ఫారాల్లో మొత్తం 64 వేల కోళ్లు ఉండగా ఇప్పటికే సుమారు 62 వేలు చనిపోయాయి.కానూరు అగ్రహారంలో ఈ నెల ఒకటో తేదీ నుంచే కోళ్లు చనిపోతున్నట్టు అధికారులకు సమాచారం వచ్చింది.ఈ మేరకు కాకినాడకు చెందిన లేబోరేటరీ సిబ్బంది వచ్చి పరీక్షించి 83 శాంపిల్స్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్ ఉన్న నేషనల్ హైసెక్యూరీటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబోరేటరీకి పంపించారు.వీటిని మూడు రకాలుగా పంపించారు. మూడు చనిపోయిన కోళ్ల శాం పిల్స్, 40 కోళ్ల ముక్కు టెస్ట్, మరో 40 కోళ్ల రెట్ట శాంపిల్స్‌ను పంపించారు. చనిపోయిన మూడు కోళ్లలో రెండు కోళ్లకు బర్డ్ ఫ్లూ ధ్రువీ కరణ అయింది.ఈ మేరకు ఆదివారం సాయంత్రం రిపోర్టు పంపారు.మిగతా శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. సుమారు 10 రోజులుగా బర్డ్ ఫ్లూ అనే ప్రచారం జరిగినా పౌల్ట్రీ రైతులు, పశు సంవర్ధక శాఖాధికారులు పట్టించుకోలేదు.దీంతో పరిస్థితి ఇంత వరకూ వచ్చింది.విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశు సంవర్ధక సిబ్బందికి షోకాజ్ నోటీసులివ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. కానూరు అగ్రహారం, నల్లజర్ల, చాగల్లు,సీతానగరం మండలం మిర్తి పాడు తదితర ప్రాంతాల్లో కోళ్లు చనిపోతున్నట్టు సమాచారం.దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.జిల్లాలో అన్ని మాంసం దుకాణాలు తనిఖీలు చేస్తున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఇది మనుషులకు సోకవచ్చు..

బర్డ్‌ఫ్లూ మనిషికి సోకే ప్రమాదం ఉంది. విపరీతంగా జలుబు, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.ఇది ఒక విధమైన కరోనా లక్షణం. కానూరు అగ్రహారం పరిసర ప్రాంతాలైన 34 గ్రామాలకు 34 టీమ్‌లను పంపిస్తున్నాం. అక్కడ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వైద్యశాఖకు కూడా తెలిపి, అక్కడి పనివారికి కూడా పరీక్షలు నిర్వహించాం. కోళ్లఫారంలో పనిచేస్తున్నవారికి ఎటువంటి రోగ నిర్ధారణ జరగలేదు.

- టి.శ్రీనివాస్, పశుసంవర్ధక జిల్లా అధికారి

చికెన్, గుడ్లు తినవద్దు..

కలెక్టర్ ప్రశాంతి

కొద్ది రోజుల పాటు చికెన్, గుడ్లు తినవద్దు. కానూరు అగ్రహారం గ్రామానికి 10 కి.మీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గ్రామంలో ఒక కిలోమీటరు మేర రెడ్ జోన్‌గా.. 10 కిలోమీటర్ల పరిధిలో సర్వే లెన్స్ జోన్‌గా ప్రకటించాం. ఇక్కడ పోలీసులు 144, 133 సెక్షన్లు అమల్లోకి తెచ్చారు. ఎక్కడ బర్డ్స్ చనిపోతున్నా అధికారులకు సమాచారం ఇవ్వండి.గత వారంలో ఇక్కడి పౌల్ట్రీల నుంచి కోళ్ల రవాణా ఎక్కడికి జరిగిందో సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించాం. 10 కి.మీ పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల్లో ఏమైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలుంటే ఆరా తీసి వైద్య సహాయం అందిస్తాం. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని.. 9542908025 నెంబర్‌లో డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటారు. ప్రతి మండలంలోనూ ఇంటింటికీ రెండు శాతం క్లోరైడ్ పిచికారీ చేయాలి.

కరోనా.. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఒకటే

బర్డ్‌ఫ్లూ, కరోనాకు కూడా ఒకే లక్షణాలు ఉంటాయి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లు మెడలు వాలేసి ఆకస్మికంగా ప్రాణాలు వదిలేస్తాయి. ఇది ఒక వైరస్. అంటువ్యాధి. రకరకాల కారణాలతో ఈ వైరస్ దాపురిస్తుంది.

అంగన్‌వాడీలకు గుడ్లు నిలిపివేత

తూర్పుగోదావరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు పంపిణీ నిలిపివేసినట్టు జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి కె.విజయకుమారి తెలిపారు. వారంపాటు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఈ మేరకు సీడీపీవోలకు ఆదేశాలిచ్చామన్నారు.

కానూరులో పక్షుల వేట

కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామంలో కిలోమీటరు మేర ఏ రకమైన పక్షలు ఉన్నా వెంటనే చంపేసి పాతి పెట్టాలని ఆదేశాలిచ్చారు. ఈ వ్యాధికి వ్యాక్సీన్ లేదు. వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టాలంటే కోళ్లు, బాతులు,ఇతర పక్షులేమైనా సరే చంపేయడమే మార్గమని అధికారులు చెబుతున్నారు.చంపేసిన వాటిని ఒక్కో గోతిలో 1800 కోళ్ల వంతున పాతి పెట్టేయాలని ఆదేశించారు. కోళ్లతో పాటు ఇతర పక్షి జాతి కూడా ఉండకూదన్నారు.

మార్కెట్ ఢమాల్..

తూర్పుగోదావరి జిల్లాలో 250 కోళ్ల ఫారాల్లో 2కోట్ల60లక్షల కోళ్లు ఉన్నాయి. బర్డ్ ఫ్లూ ప్రబలడంతో జిల్లాలో కోడిమాంసం, గుడ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. చికెన్, గుడ్లు తినడానికి ప్రజలు భయపడుతున్నారు.చాలా చోట్ల దుకాణాలు వెలవెలబోతున్నాయి. వాస్తవానికి ఉడకబెట్టిన తర్వాత ఏ ప్రభావం ఉండదని చెబుతున్నప్పటికీ ప్రజలు మాత్రం తినడం మానేశారు.

కానూరు అగ్రహారంలో అధికారుల పరిశీలన



కానూరు అగ్రహారం పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చాయని పశుసంవర్ధక శాఖ డీడీ ఎస్.సత్యనారాయణ తెలిపారు. పశుసంవర్ధక, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులు సోమవారం గ్రామానికి విచ్చేసి కోళ్లఫారాలను పరిశీలించి మాట్లాడారు. కిలోమీటరు పరిధిలో ఉన్న పౌల్ట్రీ కోళ్లతోపాటు నాటు కోళ్లకు వ్యాధి సోకుతుందన్నారు. ప్రస్తుతం రెండు ఫారాల్లో మిగిలిన కోళ్లు చనిపోతాయన్నారు. మండలంలో మిగిలిన ఫారాలకు వైరస్ సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ డి.అచ్యుతకుమారి మాట్లాడుతూ కానూరు అగ్రహారంలోని 10 కిలోమీటర్ల పరిధిలో కోళ్లఫారాల నుంచి ఎటువంటి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.





కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్ 6

ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ

ఏలూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వస్తున్న ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు.. (పక్కన ఇన్‌సెట్)లో కేంద్రమంత్రి వర్మ, రాష్ట్ర మంత్రులు దుర్గేష్, సుభాష్, రామానాయుడు తదితరులు

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి చివరిరోజు భారీగా నామినేషన్ల దాఖలు 6

- మొత్తం 59 మంది అభ్యర్థులు.. 72 సెట్ల నామినేషన్లు
- పూర్తయిన నామినేషన్ల స్వీకరణ.. నేడు పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకు గడువు

బర్డ్‌ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు
- కాకినాడ జిల్లా కలెక్టర్ సూచన

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వ్యాధివల్ల ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కువసంఖ్యలో కోళ్లు ఆసక్మికంగా చనిపోతున్నందున కోళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. ఈ మేరకు సోమవారం జారీ చేసిన ఒక ప్రకటనలో కాకినాడ జిల్లాలో 2లక్షల10వేల పెరటి కోళ్లు, 94లక్షల85వేల బ్రాయిలర్స్, లేయర్స్ కోళ్లు ఉన్నాయని తెలిపారు. బర్డ్‌ఫ్లూ వ్యాధివల్ల వంటి అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలోని 21మండలాల్లో మండలానికి రెండు చొప్పున 42 ర్యాపిడ్ రెస్పాన్స్‌టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని లేయర్, బ్రాయిలర్ కోళ్లఫారాల్లో వాటి కదలికలు నియంత్రణ చేశామని, యజమానులు కోళ్ల ఫారాల్లో శానిటైజేషన్ చేయించాలన్నారు. ఉడికించిన గుడ్లు, మాంసం తినడంవల్ల మనుషులకు బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందదని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.



విద్యార్థినికి మాత్ర వేస్తున్న డీఎంహెచ్‌వో

విద్యాలయాల్లో అల్బెండజోల్ పంపిణీ

- 92.34శాతం మందికి పూర్తి
- మిగిలిన విద్యార్థులకు 17న..

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణా కార్యక్రమం జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో 1 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు అల్బెండజోల్(400ఎంజీ) మాత్రలను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఆయన స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4,73,293మంది పిల్లలను లక్ష్యంగా పెట్టుకోగా వారిలో 4,37,038అనగా 92.34శాతం అల్బెండజోల్ మాత్రలు మిగించినట్లు తెలిపారు. మిగిలిన పిల్లలందరికీ ఈనెల 17న జరిగే ఎంవోపీయూపీ డే రోజున మింగించి ఈ కార్యక్రమాన్ని 100శాతం విజయవంతం చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీపీఎంవో డాక్టర్ సురేఖ, ఎఫ్ఆర్‌టీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విల్సన్, డీఎంఓ డాక్టర్ రవికుమార్, మెడికల్ అండ్ హెల్త్ పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్ ఇంట్లో రేషన్‌బియ్యం స్వాధీనం

- గొల్లప్రోలులో పోలీసు, రెవెన్యూ అధికారుల తనిఖీలు
- 17.49క్వింటాళ్ల బియ్యం పట్టుబడిన వైనం
- వైసీపీ కౌన్సిలర్ సహా మరొకరిపై కేసు నమోదు



గొల్లప్రోలులో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ఒక ఇంటిలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో వైసీపీ కౌన్సిలర్‌తోపాటు మరొకరిపై కేసు నమోదు చేశారు.

గొల్లప్రోలు పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఒక ఇంట్లో చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేసే రేషన్‌బియ్యం నిల్వలు ఉన్నాయని అందిన సమాచారంతో గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు సంయుక్తంగా సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. అక్కడ అక్రమంగా నిల్వఉంచిన 17.49 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇల్లు వైసీపీ కౌన్సిలర్ దుర్గానందరావుదిగా గుర్తించారు. దీనిపై సివిల్‌సప్లైస్ డిప్యూటీ తహసీల్దారు భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు నగర పంచాయతీ వైసీపీ కౌన్సిలర్ మొగలి దుర్గానందరావు, సిరిపిరెడ్డి వీరభద్రరావులపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తునిలో బాలుడి కిడ్నాప్ కలకలం 7



- పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు..

ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ 7

సర్వర్ స్లో..

- కార్పొరేషన్‌కి వచ్చి వెనుదిరుగుతున్న పన్నుదారులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పన్ను చెల్లించేందుకు కార్యాలయానికి వస్తున్న వినియోగదారులకు అక్కడ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు కారణంగా నిరాశకు గురవుతున్నారు. ఇంటి,కుళాయిపన్ను, ఖాళీ స్థలం పన్ను ఇలా పలు రకాల పన్నులు చెల్లించేందుకు కాకినాడ వాసులు కార్పొరేషన్ కార్యాలయానికి వస్తున్నారు. వారికి సర్వర్ పనిచేయడంలేదని సిబ్బంది చెప్పడంతో అసహనానికి గురవుతూ అందరూ వెనుతిరిగారు. అందరికీ సమాధానం చెప్పలేమనుకున్న అధికారులు సర్వర్ పనిచేయడంలేదని బోర్డు ఏర్పాటు చేశారు.



సర్వర్ పనిచేయడం లేదంటూ పెట్టిన బోర్డు

'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్

- మస్తర్లలో తేడాతో రికవరీకి ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2023-2024కు సంబంధించి కోటనందూరు పిఠాపురం మండలాల్లో చేసిన పనులు తనిఖీ చేశారు. కొన్నిప్రాంతాల్లో మస్తర్లలో తేడా రావడంతో అధికారులు రికవరీకి ఆదేశించారు. రెండు మండలాల్లో జరిగిన పనులనివేదికను చదివి వినిపించారు. కొలతల్లో తేడాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్తర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదా లు గుర్తించారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సోషల్ ఆడి ట్ అధికారులు సింహాద్రి, హెచ్ఆర్ మేనేజర్ రాజేష్, ఏపీడీ వసంత మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు. కాగా, ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ తనిఖీ ప్రజా వేదికకు మీడియాకు ఎలాంటి సమాచారంఇవ్వకుండా గోప్యంగా నిర్వహించారు.



స్వామివారి ఆలయంలో పండిత సదస్యం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

వైభవంగా పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పండిత సదస్యం వైభవంగా జరిగింది. ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై అలంకరించి సదస్యం నిర్వహించారు. ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాముల సారధ్యంలో ప్రత్యేక మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లకు వేదాశీర్వచనం ఇచ్చారు. కల్యాణం, రథోత్సవం ముగిసిన తర్వాత స్వామి, అమ్మవార్లు ఆశీర్వచనం పొందే ఈ ఘట్టం భక్తులను పులకింపజేసింది. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి ధూప సేవ జరి పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, దాసరి వాసు, అయినపర్తి ఏసు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, వలవల రాంబాబు, దత్తుడు, పేరూరు వేద పండితులు పాల్గొన్నారు.



హనుమత్, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం



హనుమత్, సింహ వాహనాలపై అంతర్వేది నరసన్న

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి వెంకటసత్యనారాయణరాజు వారిచే నిర్మితమైన హనుమద్వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. తొలుత వాహనశాల వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను వాహనంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహన నిర్మాతలు, అధికారులు, అర్చకులు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి లక్ష్మణరావుచే నిర్మితమైన సింహ వాహనంపై పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, అయినపర్తి ఏసు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, వలవల రాంబాబు, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

నేడు రాజాధిరాజ, అశ్వవాహనాలపై గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు రాజాధిరాజ వాహనంపై ఊరేగుతారు. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ జరుగుతుంది. రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు.

చక్రస్నానానికి ఏర్పాట్లు

బుధవారం ఉదయం 8 గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో బారికేడ్లు నిర్మించి భక్తులంతా కార్యక్రమాన్ని తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



సైకిల్ యాత్ర చేస్తున్న ముత్తు సెల్వన్

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తున్నట్టు తమిళనాడు కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్ తెలిపారు. యాత్రలో భాగంగా సోమవారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1,111 రోజుల పాటు ఐదు దేశాల్లో 34,300 కిలో మీటర్లు మేరకు సైకిల్ యాత్ర చేస్తున్నానన్నారు. 2021 డిసెంబరు 21న ప్రారంభించిన యాత్ర నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మయన్మార్‌లో సాగిందన్నారు. ఇప్పటిదాకా 29వేల కిలోమీటర్లు పూర్తి చేశానని, ఢిల్లీలో ఇండియా గేటు వద్ద ముగిస్తానన్నారు.

కర్ర పెండలం క్రషింగ్

కాకినాడ జిల్లాలో పది మిల్లుల్లో ప్రారంభం... పుట్టికి రూ.1,200 గిట్టుబాటు కాదంటున్న రైతులు



క్రషింగ్‌కు సిద్ధంగా ఉన్న కర్ర పెండలం దుంపలు

సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పది సగ్గుబియ్యం మిల్లుల్లో క్రషింగ్ సీజన్ ప్రారంభమైంది. ఆంధ్రా శాగో మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నిర్దేశించిన ప్రకారం జనవరి నెలాఖరు నుంచే దుంప క్రషింగ్ సీజన్ ప్రారంభించాలని అనుకున్నప్పటికీ మిల్లుల్లో కొన్ని సాంకేతిక అవరోధాలను సరిదిద్దడంలో కొంతమేర జాప్యం జరిగినట్టు సమాచారం. ఈ కారణంగానే ఫిబ్రవరి మొదటి వారంలో మూడవ తేదీన మిల్లుల్లో క్రషింగ్ ప్రారంభించినట్టు మిల్లర్లు చెప్పారు. కర్రపెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారుచేసే మిల్లులు రాష్ట్రంలో కేవలం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అందునా సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలు, ఏజెన్సీ మండలాల్లో సాగవుతున్న కర్ర పెండలం దుంప మొత్తం సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని సగ్గుబియ్యం మిల్లులకే సరఫరా అవుతుంటాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 28 సగ్గుబియ్యం మిల్లులు ఉన్నప్పటికీ ఈ ఏడాది సుమారు 10 మిల్లులలోనే దుంప క్రషింగ్ జరిపేందుకు సన్నాహాలు చేశామని ఆంధ్రా శాగో మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. రైతుల నుంచి గత ఏడాది కర్ర పెండలం దుంప పుట్టికి (225 కిలోలు) రూ. 1,600 చెల్లించగా ప్రస్తుత ఏడాది పుట్టికి రూ.1,200 మాత్రమే చెల్లించేందుకు నిర్ణయించడంతో ధర గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. అయినా గత్యంతరం లేని పరిస్థితిల్లో పక్వ దశకు చేరిన కర్ర పెండలం దుంపను సగ్గుబియ్యం మిల్లర్లు చెప్పిన ధరకే రైతులు సరఫరా చేస్తున్నారు. గత ఏడాది కొనుగోలు చేసిన ధరకన్నా పుట్టికి రూ.400 చొప్పున నష్టపోవాల్సి వస్తున్నట్టు రైతుల వాదనగా వినిపిస్తోంది. సగ్గుబియ్యం తయారీకి ఉత్పాదక వ్యయం పెరుగుతుండడం, సేలం మార్కెట్‌లో సగ్గుబియ్యం బస్తాకు (60కిలోలు) రూ.3,600కు మించకపోవడంతో దుంపకు అంతకుమించి ధర చెల్లించలేపోతున్నట్టు మిల్లర్లు చెప్తున్నారు. ఈ ఏడాది కర్ర పెండలం దుంప సాగుకు సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన భూమిలో దుంప ఎదుగుదల లోపించడం ఒక కారణం. అధిక శాతం మెట్ట రైతులు పామాయిల్ పంట సాగుకు మొగ్గుచూపుతుండడం మరో కారణంగా. దీంతో కర్ర పెండలం దుంప సాగు విస్తీర్ణం రానానూ తగ్గుతోందని పలువురు దుంప రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం 10వేల ఎకరాలలోపు మాత్రమే దుంప సాగు జరిగినట్టు మిల్లర్ల సమాచారం. రైతులకు ప్రైవేట్ అప్పులుగా పంట పెట్టుబడులు మిల్లర్లు మాత్రమే ఇస్తున్నందున వ్యవసాయ, ఉద్యానవన శాఖల సర్వే కన్నా మిన్నగా దుంప సాగు విస్తీర్ణం సర్వే సమాచారం మిల్లర్లకే ఎక్కువగా తెలుస్తుంది. కాగా దిగుబడి ఎకరాకు 25 పుట్లు అందే అవకాశాలు ఉన్నాయని దుంప రైతు బండే కొండలరావు ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనందున దుంప రైతులు నష్టపోయే ప్రమాదమే గాక భవిష్యత్తులో దుంప సాగు ఉనికి కనుమరుగయ్యే అవకాశాలున్నాయని కొండలరావు వాపోయాడు. రాష్ట్రంలోనే ఏకైక దుంప పరిశోధనా కేంద్రం పెద్దాపురంలో ఉన్నప్పటికీ పండించిన దుంపకు గిట్టుబాటు ధర కల్పించడంలోను, సగ్గుబియ్యం మిల్లర్లు ఉత్పత్తి చేసిన సగ్గుబియ్యానికి సేలం మార్కెట్లో గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తాటిపర్తిలో ముగిసిన

ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

● ఉత్తమ నాటికగా మూల్యం



తాటిపర్తిలో చివరిరోజు ప్రదర్శించిన గురితప్పిన వేట నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమాజానికి సందేశాన్ని ఇస్తూ, ప్రజలను ఆలోచింపజేసే విధంగా నాటికల పోటీల ప్రదర్శనలు సాగాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 5రోజులు పాటు జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు సోమవారం తెల్లవారు జామున ముగిశాయి. చివరిరోజున గుంటూరు జిల్లా పొన్నూరు రసఝురి కళాకారులు ప్రదర్శించిన గురి తప్పిన వేట అందరిని ఆకట్టుకుంది. మూలకథను మోదుగ సుధ అందించగా, వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.

విజేతలు వీరే...

ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన మూల్యం నాటిక ఎంపిక కాగా ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా జనరల్ బోగీలు(కొలకలూరి సాయి ఆర్ట్స్)నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత(విశాఖపట్టణం తెలుగు కళాసమితి) ఎంపిక కాగా, ఉత్తమ రచనగా సింహప్రసాద్(మూల్యం), ఉత్తమ నటుడిగా పీపీ వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ నటిగా జ్యోతి రాజ్(మూల్యం), ఉత్తమ ప్రతినాయకుడిగా ఎన్.వెంకటేశ్వరరావు (విముక్తి), ఉత్తమ హాస్య నటుడిగా కన్నబాబు(నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ సహాయ నటుడిగా కావూరి సత్యనారాయణ(చిగురు మేఘం), ఉత్తమ ద్వితీయ నటిగా సురభి ప్రభావతి(జనరల్ బోగీలు), ఉత్తమ రంగాలంకరణ దివాకర్ ప్రభాకర్(మూల్యం), ఉత్తమ ఆహార్యంగా నాగు(చిగురుమేఘం), జ్యూరీ బహుమతుల్లో కె.నాగేశ్వరరావు(జనరల్ బోగీలు), బి.శివశంకరశాస్త్రి(మూల్యం), సమాజానికి సందేశం ఇచ్చే నాటక రచయితగా పీటీ మార్గవ్(జనరల్ బోగీలు) ఎంపికయ్యారు. విజేతలకు మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, ఇతర ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అపర్ణాదేవి ఆలయ ప్రధాన అర్చకుడు ఆకొండి ప్రభాకర శాస్త్రి, న్యాయనిర్ణేత రాజాతాతయ్య పాల్గొన్నారు.

గొర్రిపూడిలో శూలాల సంబరం



నోటికి శూలాలు గుచ్చుకున్న భక్తులు

కరప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో పురాణ ప్రాశస్త్యం కలిగిన బసవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అలుగుల(శూలాల) సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కరికాల భక్తులు గత 7 దశాబ్దాలుగా ఈ సంబరాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం కరికాల భక్తులు తమ బుగ్గలకు శూలాల ను గుచ్చుకుని ట్రాక్టర్ల మీద గ్రామంలో ఊరేగారు. అంతకుముందు బసవేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని సమీప కాలువలో స్నానం చేయించి పంచామృతాలతో అభిషేకించారు. బంకమట్టితో నంది ప్రతిమను రూపొందించి పూజల నంతరం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు.

ముగిసిన పొన్నాడ బంగారుపాప ఉత్సవాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో ఈనెల 7న ప్రారంభమైన బషీర్‌బీబీ ఔలియా 70(బంగారుపాప)వ ఉరుస్ ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. ఆదివారం సాయంత్రం మూలపేట నుంచి బంగారు పాప ఆలయానికి ముజావర్లు గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. గంధం బంగారుపాప ఆలయానికి చేరుకున్న అనంతరం అక్కడ ముజావర్లు పాతెహకానీ అనగానే గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. బంగారుపాప దర్శనానికి అనేక ప్రాంతాల నుంచి నుంచి విచ్చేసిన హిందూ, ముస్లిం భక్తులు గంధం కోసం పోటీపడడం విశేషం. బంగారుపాప ఉరుస్ ఉత్సవాల్లో పాల్గొని బంగారుపాప గంధాన్ని పూసుకుంటే తలచిన పనులన్నీ జరుగుతాయని భక్తుల నమ్మకం.



బంగారుపాప దర్గాకు గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న ముజావర్లు

లక్ష్మీనరసింహస్వామి దివ్య అధ్యయన మహోత్సవాలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

కోరుకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య అధ్యయన మహోత్సవాలు(తిరునాళ్ళు)వైభవంగా సాగుతున్నాయి. ఏటా స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు నెల రోజులు ముందు ఈ దివ్య తిరునాళ్లు జరుగుతాయి. దీనిలో భాగంగా లక్ష్మీనరసింహస్వామి వారు రోజుకొక్క వాహనంపైన గ్రామోత్సవం చేస్తారు. మంగళవారం రాత్రి అశ్వ వాహనంపై గ్రామోత్సవం, బుధవారం రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల్లో లక్ష్మీనరసింహస్వామి వారు 5రోజులు పాటు 5వాహనాల్లో గ్రామోత్సవం చేస్తుండగా అధ్యయనోత్సవాల్లో మాత్రం 5రోజులుపాటు అనంత పద్మనాభ స్వామి వివిధ వాహనాల్లో గ్రామోత్సవం చేస్తారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న కొండపై బేడా ఉత్సవం, శ్రీ నమ్మాళ్వార్ల పరమ పద ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం భీష్మ ఏకాదశి నాటి రాత్రి కొండపైకి తీసుకువెళ్లిన స్వామి వారి ఉత్సవ మూర్తులను గురువారం ఉదయం కిందికి తీసుకువస్తారు.

13 నుంచి రంగనాధ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు

లక్ష్మీనరసింహస్వామి అధ్యయనోత్సవాలు ముగిసిన తరువాత ఈనెల 13, 14 తేదీల్లో శ్రీ రంగనాధ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సమయంలో ఉదయం, సాయంత్రం సేవా కాలం, రాత్రికి బేడా ఉత్సవం, తీర్థప్రసాద గోష్టి నిర్వహిస్తారు.

15 నుంచి పద్మనాభస్వామి ఆలయంలో..

శ్రీ రంగనాధ స్వామి అధ్యయనోత్సవాలు అనంతరం ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన క్షేత్ర పాలకులైన శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి వారికి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం సేవాకాలం, తీర్థప్రసాదగోష్టి, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పరాసర రంగరాజ భట్టర్ స్వామి తెలిపారు. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు దేవస్థానం ఈవో పర్యవేక్షణలో అర్చక స్వాములు, వేదాంత పండితులు నిర్వహిస్తున్నారు.

'ఏటీఎమ్ మోడల్ సాగుతో నిరంతర ఆదాయం'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 20సెంట్ల పొలంలో పలు రకాల పంటలను ఏటీఎం మోడల్‌లో సాగు చేయడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం కాకి నాడ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎలియాజర్ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో రైతు ఆకుల వీరభద్రరావు పొలంలో ఏటీఎం మోడల్ సాగు, ఘనజీవామృతం, బయోచార్ తయారీలను రాష్ట్రంలోని 26 జిల్లాల ఎన్‌పీఎం పావుల ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం స్టేట్ కన్సల్టెంట్లు జానకి, బుజ్జిబాబు, రిసోర్స్‌పర్సన్లు శివచక్రం, గోపాలకృష్ణ, భీమరాజు పాల్గొన్నారు.

చివరి రోజు పోటెత్తిన

నామినేషన్లు

- 29 మంది 48 సెట్ల నామినేషన్ల దాఖలు
- మొత్తం 59 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్లు
- పూర్తయిన నామినేషన్ల స్వీకరణ.. నేడు పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకు గడువు

ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు చివరి రోజు సోమవారం దరఖాస్తులు పోటెత్తాయి. చివర రోజు ఒక్కరోజే పెద్ద ఎత్తున అభ్యర్థులు ముహర్తాలు చూసుకుని రావడంతో ఏలూరు జిల్లా కలెక్టరేట్ కిటకిటలాడింది. సోమవారం 29 మంది 48 సెట్ల నామినేషన్ల వేశారు. దీంతో మొత్తం మీద 59 మంది 72 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 11న నామినేషన్ పరిశీలన చేస్తారు. 13న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఇదేరోజు సాయంత్రం బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. తర్వాత గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయి. 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరగనుంది.

చివరి రోజు నామినేషన్లు ఇలా..

పేరాబత్తుల రాజశేఖరం (కోనసీమ, కూటమి అభ్యర్థి), ఎం.శాస్త్రులు(రావులపాలెం), ఎం.శ్రావణి (రావులపాలెం), ఎస్.రామకృష్ణ (అత్తిలి) ఈయన తరపున బెంజిమెన్‌రాజు నామినేషన్ వేశారు. కె.జీవ దేవాదయాకర్ (చింతలపూడి), ఏళ్ల దొర బాబు (అమలాపురం), భావన ధాన్యలక్ష్మి (తాడేపల్లిగూడెం), ములకల శ్రీనివాస్ (ఏలూరు, నాలో సెట్), దిడ్ల రాఘవరావు (కోనసీమ), బి.శ్రీనివాస్ (చిం తలపూడి), బి.శ్రీరామమూర్తి(రాజమండ్రి), షేక్ హుస్సేన్(ఏలూరు), షేక్ అస్లాం(కాకినాడ), ఆర్.ముఖేష్‌బాబు (దెందులూరు), జేటీ రామారావు (రాజమండ్రి), పి.లీలా గణేష్(ఏలూరు), ఎం.అంబేడ్కర్(రామచంద్రపురం), కె.లావణ్య (నరసాపురం), కె.నాగేశ్వరరావు (రాజమండ్రి), కృష్ణ మోహన్ (కాకినాడ), పి.సుప్రజా (నర్సా పురం), కె.గౌతమ్‌బాబు (అమలాపురం), వీవీ సత్యనారాయణ (జగ్గన్నపేట), పేరాబత్తుల సత్యవాణి (కాకినాడ), వి.శ్రీనివాసరావు (పిఠాపురం), నాగభూషణ పద్మ, దాఖలు చేశారు.

అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్

కాకినాడ నుంచి అధిక సంఖ్యలో బయలుదేరిన కార్లు

ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ



పేరాబత్తుల నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏలూరు,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వికి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం కాకినాడ టీడీపీ కార్యాలయం నుంచి కూటమి శ్రేణులు భారీ ర్యాలీగా బయ లుదేరారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అశేషంగా తరలివచ్చిన మంత్రులు, కూటమి నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పేరాబత్తుల, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక మీరైతే పరిష్కరించే మనిషిగా నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కూటమి బలపర్చిన పేరాబత్తులను గెలిపిస్తాయన్నారు. కేంద్ర ఉక్కు కర్మాగారాలశాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రులు కందుల దుర్గేష్, గొట్టి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షులు కేఎస్.జవహర్, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, జ్యోతుల నెహ్రూ, ముప్పిడి వెంకటేశ్వరరావు, బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, వత్సవాట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, పులవర్తి రామాంజనేయులు, మిరియాల శిరీష, సుబ్బరాజు, ఎమ్మెల్సీలు ఎంఏ.షరీఫ్, వేపాడ చిరంజీవి, దువ్వారపు రామారావు, మాజీ మంత్రులు పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏపీఐడీసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుడి సదస్యం



భీమేశ్వరుడి సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు

● సమస్త వాహనాలపై స్వామి గ్రామోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారంరాత్రి భీమేశ్వరస్వామివారి సదస్యం ఘనంగా జరిగింది. కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామిలను వేదికపై అధిష్టింపచేశారు. ఆలయ అర్చకస్వాములు ముందుగా స్వామి,అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూచారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహం, ముక్కోటి దేవతా ఆవాహం చేశారు. అనంతరం వేదస్వస్తి, స్వస్తి ప్రవచనం జరిపారు. తదనంతరం ఆగమ పండితులు, వేదపండితులు, స్వస్తి వాచకులు, అర్చకస్వాములు, పురోహితులను నూతన వస్త్రాలతో ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని సత్కరించారు. నీరాజన మంత్రపుష్ప కార్యక్రమంతో సదస్యం పూర్తయ్యింది. వడపప్పు, పానకం భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం సమస్త వాహనములపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, పురోహితులు ఆలయసిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



వేదపండితులను సత్కరిస్తున్న ఈవో

గోడకు కన్నం...బంగారం మాయం

● ఏలేశ్వరంలో రూ.38.25లక్షల బంగారు, వెండి ఆభరణాలు అపహరణ ● ఆధారాల సేకరణలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్

ఏలేశ్వరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం బాలాజీచౌక్ సెంటర్‌లో శ్రీసిద్ధినాథ్ జ్యూయలర్స్ బంగారం దుకాణంలో రూ.38.25లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం దుకాణ యజమాని మహారాష్ట్రానికి చెందిన శివాజీ సుమారు 25 సంవత్సరాల క్రితం ఏలేశ్వరం వచ్చి బంగారం వ్యాపారాన్ని మార్కెట్‌లో కొనసాగించేవారు ఇటీవల నూతనంగా తమ వ్యాపారాన్ని మెయిన్‌రోడ్డుకు మార్చారు. సోమవారం ఉదయం పదిగంటలకు శివాజీ ఇంటి నుంచి వచ్చి దుకాణం తెరచి లోపలకి వెళ్లి చూసేసరికి దుకాణం వెనుక భాగం గోడను డ్రిల్లింగ్ మిషన్ సహాయంతో రంధ్రంగా చేసి లోపలకు దుండగులు ప్రవేశించారని దుకాణ యజమాని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని సీఐ నుంచి వివరాలు సేకరించి జిల్లా కేంద్రం కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించే పనిలోపడ్డారు. నగల దుకాణం నుంచి బయలుదేరిన జాగిరం దుకాణాలవద్దకు తిరిగి వచ్చింది. దుండగులు గోడ పగులగొట్టి లోపలకు వచ్చి సీసీ కెమెరాల డీవీఆర్‌ను చాకచక్యంగా తొలగించి లోపల రెండు నగదు లాకర్లు ఉండగా వీటిలో ఒక లాకరును పగులగొట్టి వాటిలో ఉన్న 50గ్రాములు బంగారు ఆభరణాలు, 32 కేజీల వెండి వస్తువులను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.38.25లక్షలు ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఈ దొంగతనంపై అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి దుండగులు ఎంతమంది అనేది దర్యాప్తులో వెల్లడవుతాయన్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, పోలీసు అధికారులు ఉన్నారు.





దుకాణంలో గోడకు రంధ్రంపెట్టి లోపలకు వచ్చి లాకర్లను పగులగొట్టిన దొంగలు, సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న సీఐ సూర్యఅప్పారావు, వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా వీవీ సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు కన్వీనర్‌గా నియమితులైన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, సెట్ ఛైర్మన్ ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ సమక్షంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్)ను ఎటువంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు తగినచర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తామని అదేవిధంగా కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లను నియమిస్తామన్నారు. ఈసందర్భంగా తనను కన్వీనర్‌గా నియమించినందుకు సీఎం నారాచంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ఏపీ ఎస్సీహెచ్ఈ ఛైర్మన్ కె.మధుమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, డైరెక్టర్లు వి.రవీంద్ర, సీహెచ్ సాయిబాబు, బి.బాలకృష్ణ, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, ఎం.రామలింగరాజు, పద్మరాజు, విభాగాధిపతులు వెంకటరెడ్డి, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

● కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



హాకీ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆల్ ఇండి యా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల టోర్నమెంట్‌ను కాకి నాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్ వేదికగా నిర్వహించేందుకు సన్నాహక ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నా యని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడాపోటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుండగా, కాకినాడజిల్లా యంత్రాంగం ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డుల నుంచి పురుషుల, మహిళల టీమ్‌లు ఈపోటీలలో పాల్గొంటున్నాయన్నారు. దీనికి సంబంధించి ఈనెల 6వ తేదీ వరకు ఎంట్రీలు స్వీకరించగా, 26 పురుషులజట్లు, 7 మహిళలజట్లు ఎంట్రీలు పంపాయన్నారు. ఒక్కొక్క జట్టులో 18 మంది క్రీడాకారులు, ఒక కోచ్, ఒక మేనేజర్‌లతో మొత్తం 20మంది సభ్యులు ఈపోటీలకు హాజరుకానున్నారు. లాజిస్టిక్స్ ట్రాన్స్‌పోర్ట్, రిసెప్షన్, రిజిస్ట్రేషన్, ఫుడ్, బస, వైద్యం, పారిశుద్యం తదితర అంశాల పర్యవేక్షణకు జిల్లా అధికారుల కూర్పుతో 14 ఉపకమిటీలను ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. టోర్నమెంట్‌లో జరిగే రోజువారీ పోటీలు, టీమ్‌ల వివరాలు, విజేతల సమాచారాన్ని టెక్నికల్ కమిటీ, ప్రెస్‌అండ్ మీడియా కమిటీలు అందిస్తాయన్నారు. ప్రేక్షకుల గ్యాలరీలు, క్రీడాకారుల చేంజింగ్ రూమ్‌లు, లైటింగ్, సౌండ్, తాగునీరు, మరుగుదొడ్లు, టీమ్‌లకు బస, రవాణా, ఆహారం ఏర్పాట్లతో ఆల్ ఇండియా సివిల్ సర్వీ సెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు రంగం సిద్ధం అవుతోందన్నారు.

తునిలో బాలుడి కిడ్నాప్ కలకలం

● పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తల్లి వద్దకు చేరిన బాలుడు

తుని రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో బాలుడు కిడ్నాప్ కలకలం రేగింది. తుని పట్నంలో భాష్యం విద్యాసంస్థల్లో ఒకటో తరగతి చదువుతున్న పరమేష్ అదృశ్యం అవడం సర్వత్రాచర్చనీయాంశమైంది. ఉదయాన్నే స్కూల్‌కి వెళ్ళిన బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు బాబుకి ఐ డ్రాప్స్ వేయాలని ఒకసారి పంపించాలంటూ స్కూల్ సిబ్బందిని కోరగా అదృశ్యమైన బాలుడు తాలూకా అని భావించిన స్కూల్ సిబ్బంది బాలుడిని బయటకు పంపించినట్లు స్కూల్ సిబ్బంది చెబుతున్నారు. బాలుడు వెళ్ళిన కొద్ది సమయానికే లంచ్ బాక్స్‌తో కుటుంబ సభ్యులు స్కూల్‌కు వెళ్ళి బాలుడి కోసం ఆరా తీయగా అదృశ్యమైన విషయం గమనించిన తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలుడు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భాష్యం పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో అవాక్కైన పోలీసులు బాలుడిని తీసుకెళ్ళిన మార్గంలో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు ముమ్మరం చేశారు. కొద్ది సమయానికి బాలుడిని దుండగులు డి.పోలవరంలో ఆటో ఎక్కించి తుని పట్టణానికి పంపిస్తున్నామని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో సీఎంఆర్ సెంటర్లో బాబు రాకకోసం ఎదురు చూశారు. దుండగులు చెప్పిన విధంగానే కొద్ది సమయానికి బాబు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పచెప్పిన తుని పట్టణ పోలీసులు కిడ్నాప్ వెనుక ఎవరు ఉన్నారు, ఎందుకు చేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు, రేపు మన్యం బంద్

రంపచోడవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాలలో అమలులో ఉన్న ఆదివాసీ అనుకూల చట్టాల సవరణ యోచనకు వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో ఆదివాసీ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బంద్‌పై పోలీసులు ఆంక్షలు విధించారు. ఆదివాసీ చట్టాల సవరణ అంశంలో ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు దుమారంగా మారడంతో ఆదివాసీ సంఘాలన్నీ ఆందోళనలు సాగిస్తూ చివరకు రెండు రోజుల రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. వీరి ఆందోళనలు, బంద్‌లపై పోలీసు అధికారులు పలు ఆంక్షలు విధించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి అనుమతులూ లేని ఆందోళనలపై చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులకు ఎక్కడికక్కడా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో నోటీసులను జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఆపడం, రవాణాలను స్తంభింపచేయడం, కార్యాలయాలను, వ్యాపార సంస్థలను మూసి వేయించడం వంటివి నేరాల కిందకు వస్తాయని పోలీసులు హెచ్చరించారు.

ఎస్ఐ మూర్తి కుటుంబానికి పోలీసుల అండ

● భారీ ఆర్థిక సాయం ● రూ.46.78లక్షలు అందజేత



మరణించిన ఎస్ఐ మూర్తి కుటుంబానికి ఆర్థికసాయం, చెక్కును అందజేస్తున్న పోలీసు మిత్రులు

కె.గంగవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారా యణమూర్తి (ఏఎస్ఎన్ మూర్తి) ఇటీవల తణుకు పోలీ స్టేషన్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వారి కుటుంబానికి తాము అండగా ఉంటామని పోలీసు మిత్రులు ముందుకువచ్చారు. సోమవారం కె.గంగవరంలో మూర్తికి నివాళి అర్పించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మిత్రులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకుని ఎస్.ఐ. పోస్టుకు ఎంపికయ్యాడు. 2012 పోలీసు శిక్షణలో చాలా చురుకుగా ఉండేవాడు. ఎవరికైనా చిన్ని కష్టం వచ్చిందంటే చలించిపోయి ఆదుకునేందుకు ముందుండేవాడు. విధి వక్రీకరించింది. అకస్మాత్తుగా చనిపోయాడు. భార్య, ఇద్దరుపిల్లలు, తల్లిదండ్రులను ఆదుకోవాలని నిర్ణయించాము. ఇద్దరు పిల్లల చదువులు, వారి భవిష్యత్ కోసం రూ.46.78 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 2012 బ్యాచ్‌కు చెందిన 1156మంది రూ.30లక్షలు ఇద్దరు పిల్లలకు చెందే విధంగా ఫిక్సిడ్ డిపాజిట్‌గా వేశారు. ఇదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా ఎస్.పి.నయీంఆస్మీ రూ.4లక్షలు తల్లిదండ్రుల నిమిత్తం. పోలీసు స్క్వాడ్ వారు 27మంది 1.10లక్షలు, ఏలూరు జోన్ పోలీస్ అసోసియేషన్‌కు చెదిన 126 మంది 10.58లక్షలు భార్యాపిల్లలకు వెరసి రూ.46.78లక్షలు మూర్తి తల్లి దండ్రులు ఆదుర్తి గోపాలరావు, సూర్యావతి, భార్య విజయలక్ష్మి, పిల్లలు చందన, హెమాన్షిలకు అందజేశారు. వీటిలో రూ.20 లక్షలు చొప్పున ఇద్దరు పిల్లలకు ఫిక్సిడ్ డిపాజిట్‌గా వేశారు. రూ.4లక్షలు తల్లిదండ్రులకు, రూ.1.68 లక్షలు భార్యకు విభజించి అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.విశ్వనాథ్, ఏలూరు రేంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజేష్, పామర్రు ఎస్.ఐ. ఎస్.కె. జానీబాషా, పోలీసుమిత్రులు శ్రీహరి, రమేష్, దుర్గారావు, శంకరు, విజయ్, వెంకటరమణ, గురవయ్య, వాసు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్వార్టర్ ఫైనల్స్

● రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు



క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి- విశాఖజిల్లా జట్లు

పిఠాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోగల బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో జరుగుతున్న మాజీ మంత్రి కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక 8వ రాష్ట్రస్థాయి యూత్(అండర్ 17) బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 13 ఉమ్మడి జిల్లాలు నుంచి బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల మూడో రోజు సోమవారం రాత్రి బాలబాలికల విభాగంలో క్వార్టర్‌ఫైనల్స్ ఉత్కంఠభరితంగా సాగాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా జట్టుపై తూర్పుగోదావరిజిల్లా జట్టు విజయం సాధించగా, గుంటూరుపై అనంతపురం, చిత్తూరుపై కృష్ణా, కర్నూలుపై పశ్చిమగోదావరిజిల్లా జట్లు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో విశాఖపై తూర్పుగోదావరి, గుంటూరుపై పశ్చిమగోదావరి, కర్నూలుపై చిత్తూరుజిల్లా జట్లు విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకున్నాయి. పోటీలను ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మాజీ సహాయ కార్యదర్శి బొజ్జా రామయ్య, ఇండియన్ ఉమెన్స్ టీమ్ కోచ్ శ్రీనాథ్, జాతీయ క్రీడాకారుడు మల్లీశ్వరరావు తదితరులు తిలకించి సూచనలు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావులు పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో సుప్రీం ఆదేశాలు పాటించాలి: పీడీజే



సమావేశం నిర్వహిస్తున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కమిటీలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల రెవెన్యూ, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నష్టపరిహారం పెంచాలి

● ప్రజాప్రతినిధుల డిమాండ్



ఏలూరులో సమావేశమైన జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):సముద్ర జలాల్లో ఆయిల్ కంపెనీలు కొనసాగిస్తున్న కార్యకలాపాల వల్ల జరుగుతున్న నష్టాలకు అందించే పరిహారం పెంచాలని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులో వీరు సమావేశం నిర్వహించారు. నష్టపరిహారం పెంపుపై ఆయిల్ కంపెనీలకు హెచ్చరిక జారీచేశారు. నరసాపురం నుంచి తుని వరకు వేటకు వెళ్ళే మత్స్యకారులందరికీ నష్టపరిహారం అందించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రస్తుతం కేటాయిస్తున్న మొత్తాన్ని రెండు శాతం పెంచాలని సూచించారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ల ద్వారా ఆయిల్ కంపెనీలకు లేఖలు పంపించేలా చర్యలు తీసుకునేందుకు సమావేశంలో నిర్ణయించినట్లు ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ళ జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, వనమాడి కొండబాబు, పంతం నానాజీలు పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

● 119 మంది అరెస్ట్, ● రూ.9,87,000 నగదు , 112 కోళ్లు స్వాధీనం

తాళ్లరేవు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోరింగ పోలీసుస్టేషన్ పరిధి జి.వేమవరంలో కోడిపందాలపై ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కోరింగి ఎస్ఐ పి.సత్యనారాయణ నేతృత్వంలో కోరింగ పోలీసులు ఆదివారం రాత్రి కోడిపందాలపై దాడిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం జి.వేమవరం గ్రామం పెంకే రాంబాబు అలియాస్ చొల్లంగి రాంబాబు మామిడితోటల్లో కోడిపందాలను నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సిబ్బంది, కాకినాడరూరల్ సీఐ, పోలీసులుకోడిపందాలపై దాడిచేశారు. 119మంది జూదగాళ్లను పట్టుకుని వారివద్ద నుంచి రూ.9,87,000 నగదు ను, 112 పందెం కోళ్లను, 5కార్లు, 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదుచేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



జి.వేమవరంలో పందాల రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు

అనపర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బిల్డింగ్ సెంటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి సెంటరింగ్ మెటీరియల్ తెచ్చి వ్యాన్ నుంచి దింపే క్రమంలో అదే వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండపేటకు చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు (29) బిల్డింగ్‌లకు సెంటరింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనపర్తిలోని రిజిస్టార్ ఆఫీసు సమీపంలో సెంటరింగ్ పనులు ఒప్పుకున్న సత్తిబాబు సోమవారం సెంటరింగ్‌కు సంబంధించిన సామగ్రిని టాటా ఇంట్రా వ్యాన్‌లో తీసుకుని వచ్చాడు. సామాన్లను దింపే క్రమంలో వ్యాన్ వెనుక భాగంలో నిలుచున్న సత్తిబాబు అనుకోకుండా వ్యాన్‌ను డ్రైవర్ వెనుకకు నడపడంతో సత్తిబాబును ఢీకొంది. దీంతో అక్కడే ఉన్న కర్రలపై పడటంతో సత్తిబాబు చెంపకు కర్ర బలంగా తగలడంతో అక్కడికక్కడే కూలబడ్డాడు. స్థానికులు సత్తిబాబును అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి



మృతి చెందిన పండ్ల వ్యాపారి నరెడ్ల సత్తిబాబు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు ప్రత్తిపాడు తోటవీధికి చెందిన నరెడ్ల సత్తిబాబు(62)స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం పొందుతున్నాడు. సోమవారం రాచపల్లి అడ్డురోడ్డులోని హోటల్ నుంచి భోజనం పొట్లాలను మోటార్ బైక్‌పై తీసుకువస్తుండగా మినర్వా విద్యాసంస్థల ఎదుట తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్లే వాహనం ఢీ కొంది. దీంతో సత్తిబాబు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో సత్తిబాబు మృతి చెందడంతో స్థానిక తోటవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వానికి తరలించి ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని వృద్ధుడి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. తునినుంచి అన్నవరం వైపు వెళ్తున్న గూడ్స్ రైలుని గమనించకుండా పట్టాలు దాటుతుండడంతో రైలు ఢీకొని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వయస్సు 55, అతనివద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో, ఆర్ఐకు తీవ్రగాయాలు



వీఆర్వోకు చికిత్స చేస్తున్న వైద్యులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కొత్తపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వో, ఆర్ఐలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. రోజూవారీ విధుల్లో భాగంగా కార్యాయానికి వెళుతున్న కొత్తపల్లి ఆర్ఐ మధుసూదనరావు, వాకతిప్ప వీఆర్వో చంద్రశేఖర్ మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నారు. కొత్తపల్లి మీసేవ సమీపించే సరికి వెనుక నుంచి వేగంగా బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆర్ఐ, వీఆర్వోను ఢీకొట్టారు. దీంతో వీరిద్దరు రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వీఆర్వోకు తలకు, చెవికి గాయాలవ్వగా స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఆర్ఐ తలకు బలమైన గాయం తగలడంతో అత్యవసర చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి అస్వస్థత

కొత్తపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేసుకుంటున్న రైతులపై తేనెటీగలు దాడి చేయడంతో ఐదుగురు రైతులు అస్వస్థతకు గురైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లిలో జరిగింది. సోమవారం కొత్తపల్లిలో ఐదుగురు రైతులు దాళ్వా వరి చేలో కలుపు తీస్తున్నారు. కలుపు తీసేచోట గట్టుకుఉన్న చెట్టుకొమ్మపై తేనెతుట్ట ఉండడాన్ని గమనించకపోవడం, వాళ్ళు కలుపు తీసేందుకు తుట్ట పక్క నుంచి చేలో దిగి పనిచేయడంతో తుట్ట కదలి ఈగలు రైతులపై ముప్పేట దాడి చేశాయి. రైతులు వరి చేలల్లో నుంచి పరుగెత్తుకొంటూ గట్టుకు చేరారు. రైతులు వెంటనే చికిత్స కోసం పీహెచ్‌సీకి తరలించారు.

పరీక్ష పే కార్యక్రమాన్ని వీక్షించిన విద్యార్థులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పండూరు హైస్కూల్లో సోమవారం ప్రధాని మోదీ నిర్వహించిన పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని బీజేపీ నాయకులతో కలసి విద్యార్థులు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, బి.రామకృష్ణ, నక్కారాజు, పల్లా ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరుకు తరలిన కూటమి నాయకులు

పిఠాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ నామినేషన్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, పట్టబద్రులు ఏలూరు తరలివెళ్లారు. వారు వెళ్తున్న వాహనాలను వర్మ సోమవారం జెండా ఊపి ప్రారంభించి వారితో కలిసి వెళ్లారు.

సామర్లకోట: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)ల ఆధ్వర్యంలో కూటమి నాయకులు పెద్దఎత్తున ఏలూరు తరలివెళ్లారు. రాజశేఖర్ అఖండమెజార్టీతో గెలుపొందడం ఖాయం అని రాజప్ప పేర్కొన్నారు. కార్యక్రమం లో కూటమి నాయకులు రాజా సూరిబాబు రా జు, విత్తనాల వెంకటరమణ, గుమ్మళ్ళ రామ కృష్ణ, పాలకుర్తి శ్రీనుబాబు, మహ్మద్ అరిఫ్, కందుల విశ్వేశ్వరరావు, ముసిరెడ్డి శ్రీరాములు, కంటే బాబు, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కాపవరం దొరబాబు,నూనె రామారావు తదితరులున్నారు.

సర్పవరం జంక్షన్: గొడారిగుంట నుంచి



పిఠాపురంలో వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

100 వాహనాలతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అట్టహాసంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్లారు. ర్యాలీని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎన్నికల పరిశీలకుడు సుధాకర్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మట్టా ప్రకాశ్‌గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, కూటమి నాయకులు రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న, తాటికాయల వీరబాబు, శిరంగు శ్రీనివాసరావు, జీని శ్రీనివాస్, దాసరి శివ,పోసిన రాము తదితరులు ఉన్నారు.

అల్బెండజోల్ మాత్రలను తప్పక వేసుకోవాలి

డీఐవో సుబ్బరాజు

కరప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కేవీ సుబ్బరాజు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పలువురు విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలను మింగించి వాటిని వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతతో బాటు వ్యక్తిగత శుభ్రత తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రైవేట్ స్కూల్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులకు ఆ ల్బెండజోల్ మాత్రలను పంపిణీచేశారు. డీఐవో సుబ్బరాజు ఆధ్వర్యంలో 97 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 7,338మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్య క్రమాల్లో కరప పీహెచ్‌సీ వైద్యాధికారిణి వి.ఏంజెలిన్, హెల్త్ సూపర్‌వైజర్లు కె.రాజగోపాల్‌రావు, డీవీవీ సత్యనారాయణమ్మ, హెచ్ఎం శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు జి.రవికుమార్, కె.బాబ్జి, ఏఎన్ఎం ఉష ఉన్నారు.



కరప హైస్కూల్‌లో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఐవో సుబ్బరాజు



సామర్లకోటలో మాత్రలు వేస్తున్న దృశ్యం

పిఠాపురం: పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో డీవార్మింగ్ డే నిర్వహించారు. విద్యార్థులు, చిన్నారులకు వైద్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఇందిరానగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలో 23 అంగన్‌వాడీ కేంద్రాలతో కలిపి 55 విద్యాసంస్థల్లో విద్యార్థులుకు మాత్రలు ఇచ్చామని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జయరామ్ తెలిపారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను ప్రిన్సిపాల్ కేశవరావు అందించారు.

సామర్లకోట: సామర్లకోట మండలం, పట్టణంలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ విజయవంతమైనట్టు ఎంఈవోలు వై. శివరామకృష్ణయ్య, పి.వుల్లయ్య తెలిపారు. పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో కె. హిమమహేశ్వరి, కమిషనర్ శ్రీవిద్య, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ అమల, డాక్టర్ ప్రభ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'ఏపీఎస్పీ అభివృద్ధికి సహకరించాలి'



కమాండెంట్‌కు బొకే అందిస్తున్న అధికారులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ అభివృద్ధి, మెరుగైన శానిటేషన్‌కు సహకరించాలని కమాండెంట్ ముద్రగడ నాగేంద్రకుమార్ కోరారు. సోమవారం రమణ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌తో కాకినాడ రూరల్ ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి పసుపులేటి సతీష్, గ్రామ కార్యదర్శి జొన్నాడ నరసింహారావు సమావేశమయ్యారు. ఏపీఎస్పీలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, శానిటేషన్ నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ముద్రగడను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఎంపీడీవో సతీష్, కార్యదర్శి నరసింహారావు అభినందనలు తెలిపారు.

సాగుదారులకు పట్టాలివ్వాలంటూ ధర్నా



చెందుర్తి సచివాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కమిటీ సభ్యులు, సాగుదారులు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 4 దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు తక్షణం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో సాగుదారులు గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ సచివాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. చెందుర్తి గ్రామపరిధిలోని సర్వే నెంబరు 1లో గల 456 ఎకరాల ప్రభుత్వ, కొండ పోరంబోకు భూములను చెందుర్తి, కొడవలి, కొత్త వజ్రకూటం గ్రామాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని లిబరేషన్ నాయకులు తెలిపారు.తమకు పట్టాలివ్వాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోకుండా ఇప్పుడు ప్రభు త్వం ఈ భూమిని బడా కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుదారులు ఇప్పటికే ఈ విషయం పై హైకోర్టును ఆశ్రయించగా స్టే మంజూరు చేసిందని అయినా కొందరు వీటిని స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రయత్నాలు తక్షణం విరమించుకుని సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ, కాకర రత్నకుమారి, వివిధ సంఘాల నాయకులు మానుకొండ లచ్చబాబు, జి.నాగమణి, నక్కా మంగమ్మ, సాగుదారులున్నారు.

కష్టసుఖాలను సమభావంతో స్వీకరించాలి

డాక్టర్ ఉమర్‌ఆలీషా



పీఠం ప్రచురించిన కరపత్రాలు, గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఉమర్‌ఆలీషా తదితరులు

పిఠాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మానవుడు కష్టసుఖాలను సమభావంతో స్వీకరించాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. ఆ స్థాయికి చేరుకున్నప్పుడే మానవుడు జ్ఞానిగా రూపాంతరం చెందుతాడని తెలిపారు. పిఠాపురం శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరుగుతున్న వార్షిక జ్ఞాన చైతన్య మహాసభల్లో రెండవ రోజున భక్తులనుద్దేశించి పీఠాధిపతి అనుగ్రహభాషణ చేశారు. మనసులో భావాలను బట్టి మనిషి మనుగడ ఉంటుందని తెలిపారు. ఈశ్వరతత్వం వైపు పయనించడానికి ఆధ్యాత్మికతత్వాన్ని గ్రహించాలని చెప్పారు. పీఠం అందిస్తున్న జ్ఞాన, ధ్యాన, మంత్ర సాధనలతో కూడిన త్రయీ సాధన అవలంబించడం ద్వారా మనస్సులో ఉద్భవించే చెడుభావనలు నియంత్రించబడతాయని వివరించారు. నిస్కామ ఫౌండేషన్ నిర్వాహకురాలు అరుణ వైరాగ్యం అనే అంశంపై మాట్లాడుతూ నిత్యము, అనిత్యములపై అవగాహన పెంచుకోవడమే వైరాగ్యమన్నారు. మానవుడు కోరికలు లేని స్థితికి చేరుకుంటే వైరాగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ధనం, బంధం, కీర్తి ఈ మూడింటి పరిధులను అర్థం చేసుకుని మనిషి తన జీవన పయనాన్ని కొనసాగించాలని సూచించారు. పీఠం ఎన్ఆర్ఐ సభ్యుడు పేరూరి విజయ రామ సుబ్బారావు కృత్రిమ మేధస్సు, ఆధ్యాత్మికత అంశంపై ప్రసంగించారు. పీఠం ప్రచురించిన కరపత్రాలు, గ్రంథాలను వివిధ రంగాల ప్రముఖులతో కలిసి పీఠాధిపతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాంగకర్త బాణాల దుర్గాప్రసాదాచార్యులు, భవానీ పీఠాధిపతి శివరామకృష్ణ, మహమ్మద్ ఇక్బాల్, డాక్టర్ డి.పద్మావతి, కొండేపూడి శంకరరావు, ఏవీవీ సత్యనారాయణలు ప్రసంగించగా పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, డాక్టర్ పింగళి ఆనందకుమార్, ఎస్‌టీవీ వర్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం నాణ్యత మెరుగుపరచాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యత మెరుగుపరచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శి సిద్దు డిమాండ్ చేశారు. పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం పరిశీలించారు. భోజనం నాణ్యత సరిగా లేదని, సగం మంది విద్యార్థులు కూడా ఇక్కడ భోజనం చేసేందుకు ఆసక్తి చూపడం లేదని దీంతో విద్యార్థులు పస్తులుంటున్నారని చెప్పారు. భోజనం నాణ్యతపై ప్రభుత్వం దృష్టిసారించకపోవడం విచారకరమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, రమణ, దుర్గాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో ప్రధానమైన పెద్దాపురం-పాయకరావుపేట 132 కేవీ విద్యుత్ లైన్లు మార్పు చేసే ప్రక్రియలో భాగంగా ఈనెల 11వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో ఈఈలు ప్రభాకర్, ఖాజా రహంతుల్లా తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని జగనన్న కాలనీతో పాటు పలు ప్రాంతాలు, తాటిపర్తి, ఆక్వా కల్చర్, రైస్‌మిల్లులకు మంగళవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా మున్సిపాల్టీ సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరాలో ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున మంగళవారం ఉదయం నుంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నందున తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన విజయరత్నం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోను సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం సందర్శించారు. డిపో పరిసరాలను పరిశీలించి గ్యారేజీలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్స్ ఎంఎస్.రావు, జి.త్రిమూర్తులు, ఎండీఏ ఖాన్‌కి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకర్‌రావు, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం భాషా, పీఆర్వో సీహెచ్.వెంకట్‌రాజు ఉన్నారు.



ప్రతిభ కనబరిచిన కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం

జేఎన్టీయూకే, విప్రో అవగాహనా ఒప్పందం



అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, విప్రో ప్రతినిధులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని వీసీ సమావేశ హాల్లో విప్రో కంపెనీ కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం మధ్య సోమవారం అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) జరిగింది. కార్యక్రమంలో వర్సిటీ నుంచి ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ విప్రో నుంచి ఎన్జీఏ స్కిల్లింగ్ గ్రూప్ హెడ్ తిరునావుక్కరసు పళనియప్పన్, ఎఫ్ఎస్సీ సీఐఎస్ గ్రూప్ జీఎం పూర్వవిద్యార్థి కె.వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ క్యాంపస్‌లో విప్రో కంపెనీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) స్థాపనకు ఈ ఎంవోయూ దోహదపడుతుందన్నారు. దీనిలో శిక్షణ పొందిన విద్యార్థులకు మెరుగైన వేతనంతో విప్రో సంస్థ ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. అధ్యాపకులకు పరిశ్రమ సంబంధిత పాఠ్యాంశాలపై ఎఫ్‌డీపీ నిర్వహిస్తామన్నారు. విప్రో ప్రతినిధి పళనియప్పన్ మాట్లాడుతూ సీవోఈ ద్వారా విద్యార్థులకు 60రోజులపాటు ప్రాజెక్టు రెడినెస్ ప్రోగ్రామ్ (పీఆర్పీ)ని అందించడంతోపాటు పెయిడ్ ఇంటర్న్‌షిప్, పోస్ట్ ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా సంతకాలు చేసిన అవగాహనా ఒప్పంద పత్రాలను వీసీ మురళీకృష్ణ సమక్షంలో రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, విప్రో ప్రతినిధులు మార్చుకున్నారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు బాలకృష్ణ, కృష్ణప్రసాద్, ఎన్.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

మహనీయుడు నాయకర్



నాయకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల విద్యాభివృద్ధికి కష్టించి గడించిన యావదాస్తిని ధారాదత్తం చేసిన గొప్ప మహనీయుడు మల్లాడి సత్యలింగ నాయకర్ అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. సోమవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నాఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో స్థల ప్రదాత, విద్యా ప్రదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 110వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎంఎస్ఎన్ చార్టీస్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్‌తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వందలాది ఎకరాలు భూములను విద్యాలయాలకు దానం చేసి ఎన్నో విద్యాలయాలు నిర్మించిన మహనీయుడని, అటువంటి మహనీయుడ్ని స్మరించుకుంటూ ముందుకు వెళ్లాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.కమల కుమారి, ప్రశాంతశ్రీ, అధ్యాపకులు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర మాత్రమే'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర మాత్రమేనని, అధికార పార్టీలు వెనక్కి తగ్గకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని రాక్స్ (కుట్ర పూరిత ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక గర్జన), మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ హెచ్చరించారు. కాకినాడలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అధికార పార్టీలు వెనక్కి తగ్గకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరి సక్రమంగా లేదని విమర్శించారు. దళితులందరూ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాక్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్, న్యాయవాది బొండాడ కీర్తి నారాయుడు మాట్లాడుతూ మాలలను తొక్కేయడానికి కొంతమంది చేస్తున్న కుట్ర ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

వైద్య ఉద్యోగికి అభినందన

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వయస్సు మీద పడుతున్నా అలుపెరగకుండా పట్టువదలని విక్రమార్కుడిలా మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాల పంటను పండించిన వైద్య ఉద్యోగిని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహానాయక్ సోమవారం అభినందించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖలోని, మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పనిచేస్తున్న యాతం నాగబాబు రాజస్థాన్‌లోని ఆళ్వార్, రాజర్షి కాలేజ్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌మీట్-2025లో పాల్గొని 100, 200, 400, 800 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు.. 400 మీటర్ల రిలే పందెంలో బంగారు పతకం, 100 మీటర్ల రిలే పరుగు పందెంలో వెండి పతకం సాధించారు.



నాగబాబును అభినందిస్తున్న డీఎంహెచ్‌వో

'పళ్లంరాజు కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తి లేదు'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యుసీ సభ్యుడు పళ్లంరాజు కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తి లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అన్నారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రణాళికలు రూపొందించి పార్టీ నాయకులను, కార్యకర్తలను నడిపిస్తున్నారన్నారు. 3తరాలుగా ఎంఎం పళ్లంరాజు కుటుంబం కాంగ్రెస్ పార్టీతో విడదీయలేని అనుబంధం గల కుటుంబమన్నారు. పళ్లంరాజు పార్టీకి రాజీనామా చేసినట్లు, మరో పార్టీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేవలం కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రచారం మాత్రమేనని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయ ప్రాంగణంలో హరి హర సుత అయ్యప్పస్వామికి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం విశేష పూజలు జరిగాయి. స్వామికి మహాన్యాసపూర్వకంగా పంచామృతాలు పళ్లరసాలు, విభూది, గంధం, వట్టివేర్లు, సుగంధజలాలుతో అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. 18మెట్లు అవాహనతో అష్టోత్తరం, శరణుఘోష పంచరత్నాల హరిహరాసనంతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహించిన దృశ్యం

పూర్వ విద్యార్థుల కలయిక

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. తమ గురువులైన వి.రామన్న, శ్రీనివాసు, ఏ.గోపాలకృష్ణను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల ప్రస్తుత ఉపాధ్యాయులు శ్రీకృష్ణ, శివ, లక్ష్మీతులసిలు, పూర్వ విద్యార్థులు, విశ్రాంత గురువులు, సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజారత్నం, నాగేంద్రబాబు, రాజేష్, గంగాధర్‌రామ్, లక్ష్మణ్, కీర్తికుమార్, భీమరాజు, ఉదయ్‌కుమార్, రమేష్, పేతురు, రామకృష్ణ, దుర్గాప్రసాద్, గెడ్డం మధులత, లక్ష్మీదుర్గా, అప్పలకొండ తదితరులున్నారు.



మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 36మందికి కాకినాడ మూడో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు బృందాలతో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 36మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 19మందికి ఒక్కొక్కరికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 17మందికి ఒక్కొక్కరికి రూ.10వేలచొప్పున జరిమానా విధించారు.

పాఠశాలకు డెస్క్‌ల పంపిణీ

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):పెద్దాపురం మండలం రాయభూపాల కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం పెద్దాపురం ఐడీబీఐ బ్రాంచి సీఎస్ఆర్ నిధులతో 15 డ్యూయల్ డెస్క్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఐడీబీఐ సీనియర్ రీజనల్ హెడ్ కన్వదేబ్‌దాసు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పెద్దాపురం ఐడీబీఐ మేనేజరు ఉమామహేష్, అమీర్‌ఖాన్, డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఈ ప్రభాకర్‌శర్మ, ఎంఈవో వీఆర్‌కె చౌదరి, ప్రధానోపాధ్యాయులు కె. నిత్యానందం, సర్పంచ్ మరియమ్మ, ఉపసర్పంచ్ గోలి వీరవెంకటరామారావు,వెంకటరమణ ఉన్నారు.

వేట్లపాలెంలో విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో ఉత్సవమూర్తులను సింహవాహనంపై అలంకరించి పురవీధులమీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకుని ప్రసాదాలు స్వీకరించారు. గ్రామోత్సవం అనంతరం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులచే సదస్యం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం స్వామి,అమ్మవార్లకు శ్రీచక్రస్నానం- పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆహ్లాదం పంచేలా బోట్‌క్లబ్ అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బోట్‌క్లబ్‌కు వచ్చే సందర్శకులకు మరింత ఆహ్లాదం అందించే విధంగా అభివృద్ధి, సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. సోమవారం గొడారిగుంటలో వాకర్స్ సంఘం ప్రతినిధులు అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి బోట్‌క్లబ్ పార్కులో నగర వనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటూ ఆహ్లాదం పంచేలా బోట్‌క్లబ్‌ను అభివృద్ధి చేయడంతో పాటు బుద్ధుడు విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, గల్లా సుబ్బారావు, రాజా, గోపీ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

అరుగురు అరెస్టు

నగదు స్వాధీనం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారులోని పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏలేరు కాలువ చెంతనే పొలాల్లో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారంతో జిల్లా ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.లక్షా 78వేల 840 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరచనున్నట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

'రక్షణ కల్పించండి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తాము ఉంటున్న నివాసానికి వచ్చి చంపుతామని బెదిరిస్తున్న రౌడీల బారి నుంచి రక్షణ కల్పించాలని ఇంద్రపాలెం గ్రామానికి చెందిన చెల్లుబోయిన వీరబాబు, అశ్వని దంపతులు జేసీకి సోమవారం మొరపెట్టుకున్నారు. భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలులో పాపయ్యచావిడి వీధికి చెందిన గంపల జంబూ(40) వంట పని నిమిత్తం ఈనెల 3న చేబ్రోలు వెళ్లి అర్ధరాత్రి సమయంలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. గొల్లప్రోలులోని డంపింగ్ యార్డు సమీపంలో బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి మోటార్‌సైకిల్‌పై నుంచి జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పిఠాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పూణేకి చెందిన జయనమ్మ పతి(58) అదృశ్యమయ్యాడు. అతడు 3 రోజుల క్రితం భువనేశ్వర్ నుంచి పూణే ట్రైన్‌లో వెళ్తూ అర్ధరాత్రి సమయంలో నీరు పట్టుకునేందుకు పిఠాపురంలో దిగాడు. తాగునీరు పట్టుకునే సరికి రైలు వెళ్లిపోవడంతో పిఠాపురంలో ఉండిపోయాయని పూణేలోని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఫోన్ కూడా పనిచేయకపోవడంతో ఇక్కడకు వచ్చిన కుటుంబసభ్యులు పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి కోసం వివరాలు తెలిస్తే దినేష్‌కు సెల్ 9542667461కు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కుటుంబసభ్యులు వారు కోరారు.

13న జరిగే శిక్షణకు హాజరుకావాలి

చింతూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల13వ తేదీ నుంచి 21వరకు పెసా చట్టంపై అవగాహన, అనుసరించాల్సిన తీరుపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో పీజీ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెసా కమిటీ ఉపాధ్యక్ష కార్యదర్శులు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గుండె సంబంధ వ్యాధులపై అవగాహన



గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కూనవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత సమస్యలుంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి రావాలని కోతులగుట్ట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మహేష్‌బాబు కోరారు. గుండెనొప్పి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్షణం అందించే వైద్య సేవలపై సోమవారం ఆయన రోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. గుండెనొప్పి వచ్చిన వారికి గంట వ్యవధిలో అందించే రూ.50వేలు విలువ చేసే ఇంజక్షన్ తమ ఆసుపత్రిలో ఉందని, అవసరమైన వారుఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వివేక్‌నాయక్, డాక్టర్ తేజ, ప్రజ్వల, శ్వేత, షామిన్, బొజ్జి, తుష్టి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులి పురుగుల నివారణ దినం



మోతుగూడెం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నసీఫా సుల్తానా ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినం నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 117 మంది, యూపీ పాఠశాలలో 60మంది విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఏఎన్‌ఎంలు శ్యామల రంగమ్మ, ఆశా వర్కర్లు స్వప్న, పైడితల్లి, అంగన్వాడీ టీచర్లు కనకమహాలక్ష్మి, విజయలక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీడబ్ల్యుయుఆర్ కళాశాలలోను, కేజీబీవీ హస్టల్‌లోను విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను కూనవరం ఎంపీడీవో రామాంజనేయులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. డాక్టర్ సునీల్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది సాయిలక్ష్మి, భవానీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, డీఎస్పీ సాయి ప్రశాంత్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ టీనేజ్ ప్రెగ్నెన్సీ అనర్థాలపై తల్లిదండ్రులు, బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ, విద్యా, పోలీస్ శాఖల సమన్వయంతో అవగాహన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీఈవో మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మి, దేవమణి, మండల విద్యాశాఖాధికారులు రామకృష్ణ, బాపన్న దొర, తాతబ్బాయిదొర, ముత్యాలరావు, వై.వెం కన్న, పి.శ్రీనివాసరావు, టి.సూరారెడ్డి, పోలీస్ అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు సహకరించండి



బంద్‌కు సహకరించాలని నోటీసు అందిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

దేవీపట్నం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న జరిగే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు సహకరించాలని దేవీపట్నం మండల ప్రభుత్వాధికారులకు సోమవారం ఆదివాసీ జేఏసీ నాయకులు నోటీసులు ఇచ్చారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ వ్యాపారస్తులు, పాఠశాలలు, కార్యాలయాలకు 12న జరిగే బంద్‌కు సహకరించాలని నోటీసులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, కంగల గిరి పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయకులు బచ్చల బొజ్జిరెడ్డి, శ్రీదేవి, సోమన్న, పాపన్న, గిరిజన సంఘం నాయకులు విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏజెన్సీలోని ఖనిజసంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి పాటుపడాలని వారు డిమాండ్ చేశారు.

మన్యం బంద్‌కు వైసీపీ మద్దతు

మన్యం బంద్‌కు వైసీపీ మద్దతు ప్రకటించిందని ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివాసీ హక్కులు సవరించాలని సూచించడం దారుణమన్నారు. మన్యం బంద్‌కు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు.

డ్వాక్రా డబ్బులు వేయడం, తీయడం ఆయన ఇష్టమే

రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌లో లబ్ధిదారుల ఫిర్యాదు, దర్యాప్తు చేసిన వెలుగు ఏపీడీ

రాజవొమ్మంగి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా డ్వాక్రా గ్రూపు బ్యాంక్ ఖాతాలలో సొమ్ములు జమవుతున్నాయంటూ డ్వాక్రా మహిళలుగగ్గోలు పెడుతున్నారు. దీనిపై యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను రాజవొమ్మంగి వెలుగు ఏపీఎం రామాంజనేయులు ప్రశ్నించగా బ్యాంక్ మేనేజర్ దానికి స్పందించలేదని తెలిసింది. ఇదేవిధంగా గత వారంలో దూసరపాము గ్రామంలో రెండు డ్వాక్రా గ్రూపులకు ఒక్కొక గ్రూపులో 20లక్షల చొప్పున రెండు గ్రూపులకు 40లక్షలు బ్యాంక్ ఖాతాలలో జమ అయినట్టు తెలిసింది. దీనిపై రాజవొమ్మంగి వెలుగు అధికారులు గురు,శుక్రవారాల్లో ప్రాథమిక దర్యాప్తు చేశారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు అడగకుండా, ఎటువంటి తీర్మానం చేయకుండానే 40లక్షలను ఖాతాల్లో జమ చేసినట్టు నిర్ధారించుకోని ఉన్నాతాధికారులకు వారు ఫిర్యాదు చేశారు. సోమవారం రాజవొమ్మంగి గ్రామంలో ఏపిడి దేగలయ్య దర్యాప్తు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో బ్యాంక్ మేనేజర్ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ములు వేసినట్టు నిర్ధారించామని తెలిపారు. దూసరపాములో రెండు గ్రూపులకే కాకుండా మండలంలో మరో రెండు గ్రూపు సభ్యులు కూడా తమఖాతాల్లో డబ్బులు పడ్డాయని తమను ఆశ్రయించారని ఏపీడి తెలిపారు. రాజవొమ్మంగి మండల సమాఖ్య లీడర్లు మాట్లాడుతూ బ్యాంక్ మేనేజర్‌ను ప్రశ్నించగా తప్పయిందని...క్షమించాలని ఆయన కోరినట్టు వారు తెలిపారు. ఈ వ్యవహారంపై గ్రూపు సభ్యులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాంక్ మేనేజర్ గతంలో చనిపోయిన మహిళకు లోన్ ఇచ్చిన ఘటనను గతంలో ఆంధ్ర జ్యోతి వెలుగులోకి తేవడంతో ఆ సొమ్ములను అప్పుడు రికవరీ చేశారు. రాజవొమ్మంగి బ్యాంక్‌లో తరచూ ఈవిధమైన తేడాలు జరుగుతున్నాయని, తమ బ్యాంక్ పుస్తకంపై స్టేట్‌మెంట్ ప్రింట్ కూడా ఇవ్వట్లేదని గ్రామస్తులు వాపోతున్నారు.ఈవ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని గ్రామస్తులు, డ్వాక్రామహిళలు కోరుతున్నారు.



ఏపీడీకి సమస్యలు చెప్పుకుంటున్న మహిళలు

కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి



గన్నవరంలో ఎన్నికల ప్రచారం

ఎటపాక, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని సోమవారం టీడీపీ నాయకులు బొల్లా పుల్లయ్య, దానే రాజు ఎన్నికల ప్రచారం చేశారు. మండలంలోని గన్నవరం, కృష్ణవరం గ్రామాల్లోని పట్టుభద్రుల వద్దకు వెళ్లి రాజశేఖర్ గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు ములిశెట్టి శ్రీనివాసరావు, ఏసుపాక బాలాజీ, ఏసుపాక క్రాంతికుమార్ పాల్గొన్నారు.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఇందుకూరుపేట గ్రామంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దాడి రత్నాకర్ కూటమి నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు, బూత్ ఇన్‌చార్జి మాగాకు బాబురావు, జనసేన అధ్యక్షుడు సారపు వెంకటరాయుడు, తైలం గంగాధర్, గోళ్ల చంటిబాబు, ముచ్చు చిన్ని, ముచ్చు నాగేశ్వరరావు, ఆర్.రాంబాబు, కొమరం దొరబాబు, కర్రి మహేష్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





ఏలూరు వెళ్లేందుకు జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రత్తిపాడులో వాహనాల కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలూరు తరలిన కూటమి శ్రేణులు

జగ్గంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషను దాఖలు కార్యక్రమానికి జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కార్లలో ర్యాలీగా బయల్దేరి ఏలూరు వెళ్లారు. రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ప్రత్తిపాడు నుంచి పెద్ద ఎత్తున కూటమి నాయకులు బయల్దేరారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వాహనాల కాన్వాయ్‌ను ఎమ్మెల్యే సత్యప్రభరాజా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారంతా ఏలూరు తరలివెళ్లి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ దాఖలు సందర్భంలో ఆయనకు సంఘీభావం తెలిపేందుకు కిర్లంపూడి నుంచి కూటమి నాయకులు ఏలూరు వెళ్లారు. ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చదరం చంటిబాబు, కాళ్ల వెంకటేష్, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, ఆళ్ల శ్రీమన్నారాయణ, ఎడ్ల కృష్ణ, మాదిరెడ్డి సూరిబాబు, జనసేన కార్యకర్తలు ఉన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

తొండంగి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఏవీ నగరం పీహెచ్‌సీ పరిధిలో 2,633 మంది అర్హత కలిగిన చిన్నారులు ఉండగా 2,594 మందికి మాత్రలు వేసి 98.5 శాతం లక్ష్యం సాధించారు. కొమ్మనాపల్లి పాఠశాలలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి విద్యార్థులు మాత్రలు వేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపట్నం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు గెద్దనాపల్లి హెల్త్ అసిస్టెంట్ మంగతాయారు తెలిపారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సూరంపాలెం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరిత, క్యాంపస్ డీన్, లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, అసోసియేట్ డీన్ వానతి, కన్వీనర్ వరప్రసాద్, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తామరాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కిర్లంపూడి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడ విజ్ఞాన జ్యోతి మోడల్ స్కూల్లో సత్యసాయిబాబా ఆశీస్సులతో మన ఊరు-మన గుడి గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. కొందరిని ఆపరేషన్ నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తుమ్మలపల్లి చిట్టిబాబు, సర్పంచ్ తోట అయ్యన్న, ఎంపీటీసీ గోకేడ రాజా, నరసింహం, రాయుడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

రేపటి నుంచి కోటిలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

జగ్గంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసియున్న శివకేశవుల ఆలయం వద్ద కోటి పార్థివలింగాలు నిక్షిప్తమైన ప్రదేశంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు కోటిలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరులో తయారవుతున్న కోటిలింగేశ్వరుడు విగ్రహాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం పరిశీలించారు.



కోటనందూరులో పొగ మంచు దృశ్యం

కమ్మేసిన పొగ మంచు

కోటనందూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తుని-నర్సీపట్నం రహదారిని పొగ మంచు కమ్మేసింది. ఉదయం 10 గంటల వరకూ దారి కనిపించలేదు. దీంతో ప్రయాణికులు వాహనాలకు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లారు. నాలుగు రోజులుగా మంచు వర్షంలా కురుస్తోంది. ఈ మంచు కారణంగా జీడిమామిడి తోటలు దెబ్బతినే అవకాశముంది. ఇప్పటికే తెగుళ్ల బెడదతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అరుణాచలేశ్వర స్వామికి అభిషేకాలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో మాఘ సోమవారం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. పాలు, గంధం, పండ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. రమణ ఆశ్రమ నిర్వాహకుడు రమానంద స్వామి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



ప్రారంభిస్తున్న ఎండీ సాకేత్‌రామ్

భాష్యం పాఠశాల నూతన బ్రాంచి ప్రారంభం

శంఖవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి-కాకినాడ రోడ్డులో భాష్యం పాఠశాలను మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి వి.గోవిందరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలనే లక్ష్యంతో ఈ బ్రాంచి ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, అంజనేయులు పాల్గొన్నారు.

నానికి ఎమ్మెల్యే పరామర్శ

జగ్గంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, అనువంశిక వైద్యుడు గొట్టిముక్కల వెంకట వల్లి సుబ్రహ్మణ్యం (నాని) ఆదివారం రాజానగరం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలతో కోమాలోకి వెళ్లి కొంతమూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, గోవిందపురం గ్రామ నాయకులు వున్నారు.

గూడ్స్ వాహనాలపై కేసులు

శంఖవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బి.శ్రీనివాస్ సోమవారం కత్తిపూడి, పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తున్న పదింటిపై కేసులు నమోదు చేశారు. వాటికి రూ.98వేలు జరిమానా విధించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యురాలు

గుండెపోటుకు ఉచిత ఇంజక్షన్

ఏలేశ్వరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం గుండెపోటు రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ గుండెపోటు వస్తే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంజక్షన్ ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. దీనిపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుండెపోటు వస్తే చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వం అందించే ఉచిత ఇంజక్షన్‌పై ఆశా వర్కర్లకు, ఏఎన్‌ఎంలకు తెలియజేశారు. ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన ఏడుగురికి ఇంజక్షన్లు అందించినట్టు తెలిపారు. వైద్యులు రమేష్, హరిక, లావణ్య, సౌమ్య, రఘుపతి, ఇతిహాస్ తదితరులు పాల్గొన్నారు.



శృంగవరం-ఎం.చామవరం మధ్య రహదారిపై పెద్ద పెద్ద గోతులు

గోతులు పూడ్చండి మహాప్రభో!

రౌతులపూడి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శృంగవరం- ఎం.చామవరం గ్రామ మధ్య రహదారి అధ్వానంగా ఉంది. పెద్ద పెద్ద గోతులు పడడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న గృహాల నుంచి వచ్చే నీరు గోతుల్లో చేరుతోంది. నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రౌతులపూడి నుంచి శంఖవరం వరకు ప్యాచ్ వర్క్ చేశారు. గోతులుగా ఉన్నచోట చదును చేశారు. బంగారయ్యపేట నుంచి రౌతులపూడి వరకు నూతనంగా రహదారి పనులు చేపట్టారు. అయితే శృంగవరం-ఎం. చామవరం మధ్య రహదారిపై గోతులు మాత్రం వదిలేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గోతులను పూడ్చా లని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జీతాల్లేక ఎంపీహెచ్ఏల అవస్థలు

వై.రామవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చవిటిదిబ్బలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్ఏ (మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్)లు కె.వీరయ్య, వి.కుమారస్వామి తమకు 14 నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2006 నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేశామని 2023 నవంబరు వరకు జీతాలు చెల్లించరన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఉద్యోగాలు రెగ్యులర్ అయ్యాయని అడ్డతీగల ఎస్టీవో తమకు కేడర్ స్ట్రెంత్ లేదని జీతాలు చేయమని చెప్పారన్నారు. ఈవిషయమై ముందు కాకినాడ డీఎంహెచ్‌వో, రంపచోడవరం ఏడీఎం అండ్ హెచ్‌ఓలను పలుమార్లు కలిశామన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదని ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వారు కోరారు.

వాహనదారులు లైసెన్సు కలిగి ఉండాలి

చింతూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎంవీఐ చల్లారావు పేర్కొన్నారు. సోమవారం చింతూరులో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడారు. ఆటో, మ్యాజిక్ వాహనదారులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి



చింతూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఎంఈవో లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమ వారం జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణ తీరుని ఆయన పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్నందున సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు.

గుండెకు భరోసా

వై.రామవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన బాధితులకు రూ.45వేలు విలువైన ఇంజక్షన్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ తెలిపారు. గుండెపోటుకు గురైన రోగులు ఆలస్యం చేయకుండా తక్షణమే ఆరోగ్య కేంద్రాల్లోని సేవలను పొందాలని ఆయన తెలిపారు

మన్యం బంద్‌కు అనుమతి లేదు

చింతూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు గిరిజన సంఘాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 11, 12 తేదీలలో మన్యం బంద్‌కు గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి, ఈబంద్‌కు అనుమతి లేదని చింతూరు ఎస్ఐ పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.